

# యాద్

డి. హనుమంతరావు



ఆరోజు న్యూఢిల్లీ ప్లాట్‌ఫాంమీద జనం అంతాకోలాహలంగా వున్నారు. మసక చీకట్లో మారుమూల ప్లాట్‌ఫాంమీద వందలకొద్దీ జనం గుమిగూడి యుద్ధానికి వెళ్తున్న సైనికులకి వీడ్కోలిస్తున్న సమయమది.

ఆఫీసర్లు, సైనికులు హడావిడిగా ప్లాట్‌ఫాంమీద తిరుగుతూంటే వాళ్ళ వంక ఆరాధనగా, ప్రేమగా చూస్తున్నారు జనం. కొందరు పెట్టెల్లో కెక్కి అందులో కూర్చున్న సైనికులికి ఏవో తిన డానికిచ్చి టీ పోస్తున్నారు. కొందరుస్త్రీలు చేతులకి రక్షా బంధాల్ని కట్టుతున్నారు. కొందరు మొగాన బొట్టుపెట్టిదండలు వేస్తున్నారు. మిగతా చాలామంది జనం "ఇండియన్ ఆర్మీ జిందాబాద్!"—"భారత మాత ముద్దుబిడ్డలు— మా సైనికులు జిందాబాద్" అంటూయేవోనినాదాలు చేస్తున్నారు. కొందరు ఆడామగా యుద్ధానికి పోతున్న బంధువులకి వీడ్కోలిస్తున్నారు కన్నీటితో.

ఆరోజు కొద్దిపాటి జ్వరం, నలతగా ఉండడం మూలాన తన కంపార్ట్‌మెంట్ లోనే కూర్చొని పోయాడు లెఫ్టినెంట్ రామ్మూర్తి. ట్రాన్సిస్టర్ ట్యూన్ చేసి పాటలువింటూ, బయటయెక్కడా లైట్లు కనబడని మసక చీకట్లలో నీడల్లాంటి మనుష్యులవంక, వాళ్ళ నినాదాలవంకా చూస్తూంటే యేవో ఆలోచనలు వస్తున్నాయి.

"ఓ వీరసైనికా! ప్రచండానలమై చెల రేగి శత్రుమూకలిని మట్టుబెట్టు! నిన్ను గన్నతల్లి గౌరవంకోసం గర్వంగా ప్రాణాన్ని త్యజించు. ఆమె నుదుట నీరక్తంతో తిలకముంచు. యుద్ధభూమిలో వెనక్కి చూడక పోరాడి వీరస్వర్గమలంకరించు. తృణప్రాయంగా ప్రాణాల్నిఒడ్డి పైలో కంలో అప్సరసల కౌగిలిలో సర్వసౌఖ్యాలు అనుభవించు !......" అంటూ ఓవది గొంతులు కలిపి ప్రబోధిస్తోంది రేడియో. ఎవడో కవీశ్వరుడు డన్‌లప్పిల్లోమీద అడ్డదిడ్డంగా పడుకొని నుష్టుగా భోం చేసి కిళ్లీనములుస్తూ సిగరెట్ వేళ్ళ మధ్య యిరికించి వయ్యారంగా పట్టుకొని ప్రతిగా ముట్టే కిరాయి డబ్బులకి ఇన్‌స్పైరై అందించిన మధురకవిత! రామ్మూర్తి నవ్వుకున్నాడు.

చచ్చిపో అనడం యెంతసులభం! వీర స్వర్గం అలంకరించి, అప్సరసల్ని కౌగిలించు కోమనడం యింకాసులభం! చిక్కలేనియీలోకపు అప్సరసల్ని కౌగిలించుకోమంటేనే. రామ్మూర్తికి యేదో శిఖరం చివరనిలబడి క్షణంలో క్రిందకి కొన్ని మైళ్ళలోతుకి కూలి పడబోయే వాడిలాగా ఒకరకం నిర్లిప్తమైన వైరాగ్యం వొచ్చింది.

అవును, భారతమాత, నుదుట తిలకం, వీరస్వర్గం, అప్సరసలు యివన్నీ యెలా ఉన్నా యెవరో అన్నట్లు మంచంమీద చావు కన్నా యుద్ధంలో చావు సర్వవిధాలా శ్రేష్టం. ఏబాధలేకుండా, యే గ్రెనేడో మీద పడగా క్షణంలో ముక్కలై యెగిరి పోవడం ఎంత సుఖం!

అందులోనూ, తనలాంటి వాళ్ళకి అంతకన్నా గౌరవప్రదమైనది యింకేముంది? అతనితల్లి చిన్నప్పుడే చనిపోయింది. తండ్రి మళ్ళా పెండ్లిచేసుకున్నాడు. నానా అవస్థలూ పడి ఇంటర్‌దాకా చదివాడు గాని, ఆతర్వాత తండ్రి యింక చదివించననడంతో విరక్తిపుట్టి యింట్లోంచి పారిపోయాడు. యెలాగో సైనికోద్యోగి అయ్యాడు. అయ్యాక తండ్రికి ఉత్తరం రాయలేదు. తండ్రీ అతని గురించిపట్టించుకోలేదు. ఆప్తులైన దగ్గర బంధువులెవరూ లేరు. కమిషన్ పొందిన రెండేళ్ళ లోను ఒక్కసారీ సెలవు తీసుకుని యెక్కడికీ పోయిన పాపాన పోలేదు. తనసలెందుకు బ్రతుకుతున్నట్లు ? అన్న ప్రశ్న చాలాసార్లు వచ్చిందిగాని, దానికి సమాధానం వెతకడం యెప్పటికప్పుడు వాయిదా వేస్తూ వచ్చాడు. పాకిస్తాన్‌తో యుద్ధం వచ్చిన వెంటనే, యుద్ధభూమికి సుమంతతాను వలంటేరయి ఆ యూనిట్‌కి

పోస్టు చేయించుకున్నాడు యేదో చెయ్యాలని, వేలకొద్దీ పురుగులు యెక్కడో పుట్టి పెరిగి నశించినట్టు కాకుండా జీవితాన్ని యేదో తృప్తితో నింపుకోవాలని అతని పట్టుదల.

యెదురుగా అంతమందిలోనూ మధ్యగా, వాళ్లందరికిదూరంగా స్తంభంనీడని ఏడాది నిండని పసివాణ్ణి యెత్తుకు నిలబడ్డాడు హవల్దార్ ప్రేమ్‌సింగ్. అతనిభార్య ప్రపంచాన్నంతనీమర్చి అతనిచుట్టూ చేతులు వేసి గుండెకు తలాన్చి యేడుస్తోంది, అతను వోదారుస్తున్నా వినకుండా. అదివాళ్ల ఆఖరి కలయిక కావచ్చు.

రామ్మూర్తి నవ్వుకున్నాడు. చచ్చిపో అని వ్రాసిన కవిగారు ఆమె కన్నీళ్ల యెంత వేడో యెరుగడు. అతని చంకనున్న ఆ పసివాడి అమాయకపు చూపులవెనక అతని జీవితాన్ని తారుమారు చేసే యెన్ని విష వలయాలుతొంగి చూస్తున్నాయో కవిగారు ఊహించి యుండరు.

'దేవుడా, నీకు మనుష్యుల ప్రాణాలు కావలిస్తే నన్ను, నాలాంటి ఒంటరిగాళ్లని తీసుకో. నాకోసం యెవడూ యేడవడు!' తనుజేస్తున్న ప్రార్థనలు తనకే హాస్యంగా తోచాయి రామ్మూర్తికి. యిప్పట్నుంచీ దేవుడిగురించి ఆలోచించడం దండగని. కొన్నియేళ్లుగా దేవుణ్ణిమర్చిపోయిన వాడి నోట అప్రయత్నంగా ఆప్రార్థన రావడం అతనికి ఆశ్చర్యమనిపించింది.

అతన్నిగురించి యెవరూ యేడవరు! అసలతనికెవరూ ఏమీకారు, యెవరికీతను యేమీకాడు. ! అందుకే రామ్మూర్తి పితృప్రేమ, మాతృప్రేమ, భ్రాతృప్రేమ, పుత్రప్రేమలాంటివన్నీయెదిగీయెదగని రచయితలు, రచయిత్రులు పేరు అచ్చులో చూసుకోడానికి ప్రయోగించే మ శ యా శ మంత్రాలనుకునేవాడు! లేకపోతే నాలుగుడబ్బులు పోగేసుకోవడానికి సినిమావాళ్లు ప్రయోగించే గిమిక్కులు! యెవడిమటుకు వాడికి స్వార్థం తప్పించి యెదటవాడి యావపట్టదు. అయితే కొందరు యీ కత్తి మొనలకి తేనెపూస్తారు. తెగినపుడు తియ్యగా ఉండాలని! "మేం ఇంకా దొంగవ్యాపారాలు జేసి లక్షలు గడించాలి. మేం యింకా లంచాలు పుచ్చుకొని మేడలు గట్టాలి. మేం యింకా నీతి నిజాయితీలు గట్టున బెట్టి సన్మానాలు, సత్కారాలు పొందాలి. మేం యింకా యింకా మిగతా వాళ్లకి గోతులు త్రవ్వి మాపదవులు నిలబెట్టుకోవాలి.!....... అందుకని నువ్వెళ్లి యెదటి వాళ్లని చంపు. నువ్వు చచ్చినా సరే వెనక్కిరాకు!" అంటే చేదుగావుంటుంది కాబట్టి, "భరతమాత వేణీబంధాన్ని దుశ్శాసనులు చేతబట్టారు, నువ్వెళ్లి విడిపించుకురా, ప్రాణదానం చేసయినా సరే!" అంటారు.

ఎవరు యీ భరతమాత? యెక్కడుంది? యీ మనుష్యులందరూకారా? వీళ్లకోసం తను ప్రాణాల్నిత్యజించాలి!

"క్షమించండి, యిలా క్రిందికిదిగి రారూ!" కిటికీ ఊచలబయట ఆమె చాలా తియ్యగా ఆదరంగా పిలిచింది. రామ్మూర్తి ఆమెముఖంలోకి తేరిపారజూచాడు. ఆమె అలా ప్రశాంతంగా చూసింది. ఆమెఅంటే యేదో చెప్పలేని గౌరవం కలిగింది రామ్మూర్తికి. మంత్రం వేసినట్టు లేచి క్రిందికి వెళ్లాడు.

ఆమె అతని చేతికి రక్షబంధాన్ని కట్టి, నుదుటయెర్రగా కుంకుమదిద్దింది.

"మీరు విజయులై క్షేమంగా తిరిగి రావాలని దేవుడ్ని ప్రార్థిస్తున్నా!" అంది అదే నిశ్చలమైన చూపుతో, నిర్మలంగా మధురంగా వినబడేగొంతుతో.

రామ్మూర్తి తడబడ్డాడు. ఆమెవంక అలాగే చూస్తూ నిలబడి పోయాడు. ఆమె చూపులు తిప్పుకొని వెనక్కి తిరగబోయింది.

"మీరేమనుకోకపోతే ఒక గులాబి మీచేతులతో యివ్వండి." కొంచెంబెరుగ్గా అన్నాడు రామ్మూర్తి.

"క్షమించండి, మర్చిపోయాను. అసలు మీకివ్వాలనే తెచ్చాను. మాదొడ్లోవి!" అందామె కొద్దిగా సిగ్గుపడి, అతని చేతికందిస్తూ.

ఆమె గుంపులోకలిసి పోయింది. అలాగే చూస్తూ నిలబడ్డాడు రామ్మూర్తి.

ఆమె చల్లని చూపులు, మాటలు అతనికింతకాలం కనబడని భరతమాతరూపాన్ని కొంతవరకు గుర్తింప జేశాయి. అతని చావుకొక అర్థం కనబడినట్టయింది. తను బలికావాలి! క్షుద్రదేవతల తృప్తికోసం గొర్రె పోతులాక్కాదు! ఆమెలాంటి స్నేహశీల మానరక్షణకోసం! యీ లంచగొండుల, దొంగవ్యాపారాల, పదవీ వ్యామోహాల, ఝూటా దేశభక్తుల చచ్చు మెప్పుకోసం గాదు. ఆమెలాంటి స్నిగ్ధమూర్తులు, మామూలు అమాయకులు తలెత్తుకు తిరగడానికి! తనలో తెలివివున్నంతవరకు వెనుదిరక్క, శత్రువుల గుండెల్లో చిచ్చు బెట్టాలి. తనసలు తిరిగి రాగూడదు ! రామ్మూర్తి ఆవేశంగా ఉద్రేకంతో అనుకున్నాడు. కళ్లలోకి నీళ్లుబికి మెరిశాయి. అతని మనస్సులో కల్లోలమంతా పోయి, తృప్తిగా ప్రశాంతంగా ఉంది.

* * *

కాని రామ్మూర్తి అనుకున్నట్టు జరగలేదు. ఒకరాత్రి పెట్రోలుకి నాయకత్వం వహించిన అతను, శత్రువుల మైన్ ఒక దానిమీద అడుగుపడగా కాలు యెగిరి పోయింది. విపరీతంగా రక్తస్రావమయి స్పృహతప్పింది. కూడా ఉన్నవాళ్లు వెనక్కి తీసుకొచ్చారు. పఠాన్‌కోట హాస్పిటల్లో అతనికి ప్రథమ చికిత్స జరిగింది. ఆ తర్వాత మరివారం రోజులకి, యుద్ధమింకా ముగియకుండానే, వెనక్కి ఢిల్లీ హాస్పిటల్‌కి పంపివేశారు. అతనికి రక్తమిచ్చి మిగిలిన కాలుముక్కని తొడవరకు తీసి వేయాల్సివచ్చింది.

ఆరోజు ఆఫీసర్స్‌వార్డ్‌లో సిస్టర్‌తల క్రింద ఎత్తుగా దిండ్లు పెట్టగా మంచం మీద పడుకొని దూరంగా కిటికీబయటికి చూస్తున్నాడురామ్మూర్తి.చావగూడదనిఎందర్లో

నెలల పసికందుల్ని, నవవధువుల్ని వదలి తమదారి తాముచూసుకున్నారు. చావాలని కోరుకున్న తను యిలాచావు బ్రతుకులు రెంటికీ పనికిరాకుండా పోయాడు.

చుట్టూవున్న ఆఫీసర్ల కోసం యెందరో బంధువులు, భార్య, తల్లి,తండ్రి పిల్లలు, సోదరులు వస్తారు. యేన్నో తెస్తారు. కబుర్లు చెప్తారు. వాళ్లందరికి హాస్పిటల్లో నయమవగానే ఆరు నెలలు దాకా సెలవు ఇస్తారు. యింటి దగ్గర కావాల్సిన వాళ్లతో హాయిగా గడపవచ్చు. ఆతర్వాత మళ్లీ ఉద్యోగం. తనకి కిటికీ ఊచలేతోడు. దగ్గిర బంధువు లెవరూ లేరని, దూరపు బంధువుల చిరునామాలు తనకి తెలియవని చెప్పాడు రామ్మూర్తి. యెందరోవస్తారు మంత్రుల దగ్గర్నుంచి, మామూలు సానుభూతి పరులదాకా. కుశలప్రశ్నలు వేస్తారు. యెలాజరిగిందని అడుగుతారు. 'అశ్రుపూరిత నయనాలు' ప్రదర్శిస్తారు. ఓదార్చాలని చూస్తారు. రామ్మూర్తికీ ఓదార్పులు నరకమయి, యెవరన్నావస్తున్నారంటే నిద్రనటించేవాడు.

కొందరు దేశసేవాతత్పరులు, సంఘసేవాభిలాషులు "మేమేమన్నా సహాయం చేయగలమా?" అనడుగుతారు. "నన్ను కొంటరిగా వొదిలి వెళ్లండి"! అంటాడు రామ్మూర్తి. అతని గొంతులోని కర్కశత్వం అర్థంగాక, అదోలా చూసి వెళ్లిపోతారు పాపం, ఆనినాదాల ప్రపంచంలో కలిసిపోయే అమ్మాయిలు, అబ్బాయిలు!

"నేను మీకేమన్నా సహాయం చెయ్యగలనా?"

రామూరి ఉలిక్కిపడి చూశాడు. ఆ గొంతులో తీపిమొటిసారి అనుభవించిన ప్పుడు పరవశుడైనాడు. ఆతర్వాత యెన్నోసార్లు ఆగొంతు అతనిలో ప్రతిధ్వనించి మైమరపు కలిగించేది. ఆ గొంతు మళ్లా వినాలని అతని అంతరాంతరాళాల్లో యెక్కడో జరుగుతున్న నిరీక్షణ యీనాటికి ఫలించి కనుల విందు చేసింది. ఆనందం, విచారం రెండూ ఒక్కసారి కలిగాయి. అతనికళ్లలో సీటిపొర మెరుపు ఆమెనుంచి బలవంతాన దాచుకున్నాడు రామ్మూర్తి.

"మీరా!" అందామె ఆశ్చర్యంగా, ఆనందంగా, బాధగా. అతని రెండోకాలు ఉండాల్సినచోట ఖాళీని కప్పిన దుప్పటిని చూడగానే ఆమె దుఃఖమాగలేదు. చెంపల్ని జారే కన్నీటిని తుడవాలనిగాని అతన్నించి చాటు జేసుకోవాలని గాని ప్రయత్నించకుండా ప్రక్కగా కుర్చీలో కూలబడింది.

రామ్మూర్తి ఆమెకేవో వోదార్పుగా చెప్పాలని ప్రయత్నించి చెప్పలేక తలదించుకున్నాడు.

"నేనింకా మీకు జ్ఞాపకం ఉన్నానా?" అన్నాడురామ్మూర్తి నవ్వుతూ కాస్సేపటికి.

"యెలా మర్చిపోగలను?"అందామె. వాళ్లయిద్దరిదీ కొన్నియేళ్ల పరిచయమున్నట్టనిపించింది యిద్దరికీ.

ఆమె అడక్కుండానే అతనికి గాయమెలాగైంది, అతనికి తెలియకుండానే అతన్ని వాళ్లు వెనక్కి యెలా చేర్చింది, అంతకుముందు అతని అనుభవాలు అన్నీ వివరించాడు రామ్మూర్తి. వెనక్కి వచ్చినందుకు ఆమెకు సంజాయిషీ యిచ్చుకుంటున్న ధోరణి అతనిలో కనబడింది.

"మీ రక్షాబంధమే నన్ను వెనక్కి తెచ్చిందేమో!"

"కాని మిమ్మల్నిలా వికలాంగుల్ని చేస్తుందనుకోలేదు. నావల్ల యేదో లోపం జరిగింది." బాధపడిందామె.

రామ్మూర్తి కారోజు జీవితంలో యెన్నడూలేని ఆనందం కలిగింది. ఆమె గంటకి పైగా అతని దగ్గిరే కూర్చుని ఆమె కథనంతా చెప్పింది. విజిటర్స్ టైం అవగానే యింక మర్నాడు వస్తా నని వెళ్లిపోయింది.

సుశీల తండ్రి, తల్లి నలభైయేనిమిదిలో సింధురాష్ట్రములోని వాళ్ల వూరు వదిలిపెట్టి యీ దేశానికి తరలివచ్చారు. తండ్రి యిక్కడ కేంద్ర ప్రభుత్వంలో ఉద్యోగం సంపాదించుకున్నాడు. సుశీల అప్పటికి ఒకటి రెండేళ్లపిల్ల. యిప్పుడు కాలేజీలో చదువుకుంటుంది. సుశీల అన్న ఒకరు కొన్నినెలలముందు కాశ్మీర్లో సరిహద్దు కాల్పుల్లో మరణించాడు. అతనూ సైన్యంలో ఉద్యోగి.

మర్నాటి సాయంకాలం అనుకున్న ప్రకారం నాలుగ్గంటలకే వచ్చింది సుశీల. చలనం లేని సీటిలో కలువపువ్వులాంటి ప్రశాంతమైన ఆమె సౌందర్యం, ఆరోజు మరీ మురిపిస్తోంది. మాటలేం లేకుండా అలా కూర్చొని తదేకంగా చూడాలనిపిస్తోంది.

"మీకోసం యివి తెచ్చాను" అంది సుశీల సంచిలోంచి యేవో పాకెట్లు పుస్తకాలు బయటికి తీసి టేబిలు పై నుంచుతూ.

"మీ అభిమాన రచయిత యెవరో చెప్పండి. ఆ పుస్తకాలు తేవడానికి ప్రయత్నిస్తాను". అంది మళ్లీ.

"నన్ను అడగడం మర్చి పోయారా మాటల ధోరణిలో. మీ కింకేమన్నా కావలిస్తే చెప్పండి, తీసుకొస్తాను." కాసేపాగి అంది.

"ఏమిటి, మాట్లాడరు?" సిగ్గుపడి తలదించుకుంది. సుశీల, నిశ్చలంగా రెప్పార్పక చూసే అతని కళ్లలో ఆరాధనని తట్టుకోలేక.

"ఇవాళ కాలేజిలేదా?" రామ్మూర్తి అడిగాడు.

"మధ్యాహ్నం మానేశాను".

ఆరోజు ఆమె చేసిన అలంకారమంతా తనకోసమన్న ఆలోచన రామ్మూర్తిని గర్వపరిచింది. ఆమెది మెరుపులా కళ్లు మిరుమిట్లు గొలపక చూసినకొద్దీ చూడాలనిపించి, మన్నితంగా లలితంగా మనసుని తాకే అందం. ఆ అందానికి తగ్గట్టు సింపిల్‌గా అలంకరించుకొని ఆమె చూపులు కలిగించే ఉన్నత భావాల్ని ద్విగుణీకృతం చెయ్యగల నేర్పు ఆమెకుంది. రామ్మూర్తి దృష్టిలో సౌందర్యాని కర్థం అదే.

ఆరోజు రెండుగంటలు రెండు క్షణాల్లా

గడిచి పోయాయి. సుశీల ఏమేమో కబుర్లు చెప్పింది. రామ్మూర్తి గూడా యెన్నడూ లేని ఉత్సాహంతో మాటలు కలిపాడు. ఆమె వెళ్లిపోవాల్సిన సమయం వచ్చింది.

"సుశీలా, మీకో ప్రార్థన".

"చెప్పండి".

"రేపట్నుంచి మీరా వస్తువులు తేవద్దు నాకోసమని."

"అదేం! నేను మీకేం యియ్యెదగని దాన్నా?"

"అదిగాదు, [illegible] రొచ్చి అందించే హాయి ముందు, యీ పుస్తకాల్సు, తినే పదార్థాలు ఏమిటో లాగనిపిస్తాయి. మీరు వెళ్లాక, నాకింకేం చెయ్యాలని పించదు. చదవాలనిపించదు!

సుశీల ఒక్కసారి అతనినంక చూపి సిగ్గుపడి వెళ్లిపోయింది.

మరినాలుగు రోజులు గడిచాయి.

ఆసాయంకాలం అతన్ని మరో ధోరణిలో చూసింది సుశీల. ఏదోచెప్పలేని నిరాశ, నిస్పృహ గూడుకట్టుకున్నాయి. అతని మాటల్లో ఎప్పుడూ లేనంతగా అతనేదో గూట్లో దాక్కొని మాట్లాడుతున్నట్టుంది. ఆమె యెంత ప్రయత్నించినా అతని ధోరణి మారలేదు.

చివరికి వెళ్లిపోబోతున్నప్పుడు,

"యివాళ మీరేమిటో లాగున్నారు నేను తెలుసుకో గూడదా?" అంది సుశీల బాధగా.

"మీరు యింకెవ్వరి దగ్గిరకీ వెళ్లరేం? యీ రెండుగంటలూ నాఒక్కడి దగ్గరే యెందుకుంటూంటారు?" మెల్లిగా అడిగాడు రామ్మూర్తి.

"ఏం, మీకిష్టం లేదా?" క్రిందికి చూస్తూ అడిగింది సుశీల.

"నాబాధల్లా యిది నాకుమరీ యిష్టమయి, ఎప్పుడైనా మీరు రాలేకపోతే యెంత బాధపడాల్సి వస్తుందో అని!"

"నాకు రావడానికి వీల్లేక పోవడమంటూ వుండదు. ఎలాగైనా మీకు దగ్గరగా ఉండలనే శాయశక్తులా ప్రయత్నిస్తాను". ఏదో ఉద్వేగంతో అనేశాక, ఆమాటలు యింకా యేవో యితర

పండిత డి. గోపాలాచార్యులవారి
జీవామృతం
ఆరోగ్యానికి బలానికి
అయుర్వేదాశ్రమం
(ప్రైవేటు) లిమిటెడ్
మదరాసు-17

సలహా
క్రోల్పోయిన ఆనందం, బలం, శక్తిని తిరిగి యిచ్చేందుకు ఆహ్లాదకరమైనది. నరాల బలంకు పై పూతకు వాడే తైలం. 1 సీసా రు 11-50 స్పెషల్ రకం అర్జంటు గుణంకు రు. 27/- ఎడ్రెస్సు పంపుతూ జవాబుకు కవరు పంపాలి.
డాక్టర్ రత్నం సన్స్,
Sex Specialists (Estd 1904)
ఆజంపురా మార్కెట్ వద్ద, మలక్‌పేట బిల్డింగ్స్
హైదరాబాద్-36 (ఆంధ్రప్రదేశ్)

సువాసనలు వెదజల్లే,
మీకు సొగసు సమకూర్చే
పామోలీవ్ లవెండర్ టాల్క్

మీకు నచ్చే సువాసనలు మీ కోసం తిరిగి సృష్టించ బడ్డాయి! ప్రపంచ సౌందర్య కేంద్రాలనుంచి. గతంలో సులభంగా దిగుమతి అయ్యే సువాసనల గురించి మీరు ఇక కలలు గంటూ కూర్చో నక్కర్లేదు. ఈ నాడు పామోలీవ్ లవండర్ టాల్క్‌తో, దానిలో కలసిన సువాసనలతో మిమ్మల్ని ముంచెత్తుకో గలరు. పామోలీవ్ లవండర్‌ను వళ్లంతా జల్లుకొని సొగసుగా వుండండి.

పామోలీవ్ లవెండర్ టాల్క్‌తో ఎప్పుడూ తాజాగా పరిమళ లావణ్యంగా వుండండి




ఇంకా, పామోలీవ్ టాల్క్ డీలక్స్ 17 మనోహరమైన సువాసనలు కలిగి ఉన్నది
PT.6.A.T

కాలాలు చెప్పగా, సెలవుతీసుకొని గబగబా వెళ్లిపోయింది సుశీల.

అతర్వాత యింక మళ్ళీ మామూలుగా ఉల్లాసంగా కనబడలేదు. రామ్మూర్తి యెప్పుడూ యేవో ఆలోచనల్లో మునిగి ఉండేవాడు. అతనేం మాట్లాడకుండా ఆమెచెప్పేవే వింటూండేవాడు. ఒక్కొక్కప్పుడు ఆవినడంలో కూడా పరధ్యానం వచ్చేది. ఆమెనొచ్చుకుని మాటలుమానేస్తే క్షమార్పణ చెప్పుకొని ప్రాధేయపడేవాడు ఆమె మనస్సు కరిగేదాకా. రోజులు గడిచిపోతున్నాయి. మొదటి రోజుల్నాటి పరిచయం, స్నేహం,యింకా ఆత్మీయమైన సంబంధంగా మారింది. ఆమెరాక ఒక్కక్షణం ఆలస్యమైతేఅతను భరించలేక పోయేవాడు. ఆమె సరిగ్గా నాలుగ్గంటలకి వొస్తుంది. ఆమెవున్నంత సేపూ ఆమెవంకే చూస్తూ ఆమెరూపాన్ని తనలో ఎప్పటికీ చెరగనట్లు ముద్రించుకోవాలని చూస్తాడు. ఆమెవెళ్ళాక తనలో పదిల పర్చుకున్న ఆమెరూపాన్ని మననం చేసుకుంటూ, ఆమెగురించే ఆలోచిస్తూ ఆమెరాకకి నిరీక్షిస్తూ మిగతా సమయం గడిచి పోతుంది.

ఒకరోజు సుశీలతోబాటు, ఆమెతండ్రి కూడా వచ్చాడు చూడ్డానికి. ఆరడుగుల భారీ మనిషి మల్కానీ. చాలా ఆప్యాయంగా పలకరించాడు. రామ్మూర్తికి తండ్రిమాటల్లో యెన్నడూ కనబడని ఆత్మీయత, ఆయన మాటల్లో కనిపించింది. రామ్మూర్తికదంతా విన్నాక ఆయన కనుకొలకుల్లో నీరునిండడం అతన్ని కదిలించింది.

"మీరుచేసిన యీత్యాగం విలువ దేశంలో చాలామందికి అర్థమవదు. యేదో కాలువిరిగి జీవితంలో దగా పడ్డారన్న మామూలు సానుభూతి తప్పించి యెన్ని వేలమంది భారతీయుల అవమానాన్ని, ధన, మాన, ప్రాణనష్టాన్ని బదులు తీర్చుకోడానికి మిమ్మల్నిమీరు బలి పెట్టుకున్నారో ఊహించలేరు. కళ్లెదుట సర్వం తగులబడి పోతుంటే కట్టుబట్టలతో, దక్కించుకున్న ప్రాణాలతో రహస్యంగా యేట్రక్కుల్లోనో, కంబళి చుట్టల మధ్యనో దాక్కొని తండ్రొకచోట, తల్లొక చోట, పిల్లలు మరోచోట అలా చెల్లా చెదరై పోయిన మాలాంటి వాళ్లకి బాగా అర్థమౌతుంది.!" అన్నాడు మల్కానీ.

ఆ తర్వాత రామ్మూర్తికి కొంతనయమయ్యాక అధికారుల ప్రత్యేకఅనుమతి మీద ఒకసాయంకాలం వాళ్లయింటికి తీసుకు వెళ్లింది సుశీల. ఆమె తండ్రి, తల్లి ఎంతో ఆదరంగా ఆహ్వానించారు. సుశీల అన్న సూరజ్ కూర్చునే చోటు, పడుకునే మంచం, అతను వాడుకునే టేబిల్ అలాగే యింకా యెప్పుడో వస్తాడన్నట్టు శుభ్రం చేసి ఉంచారు.

"క్రిందటి యాన్యువల్ లీవ్‌కి వచ్చాడు; అంతే, యింక మళ్లీ చూడలేదు!" అంది సుశీల తల్లి.

వాళ్ల జీవితాల్లో యెన్నెన్ని కష్టాలను వించారో, అవమానాలు ఎన్ని సహించారో ఊహిస్తున్నాడు రామ్మూర్తి. నిజంగా జరిగినవాటికన్నా ఊహించుకున్నవి యింకా భయంకరంగా ఉంటాయి. సుశీల, సూరజ్ ఫోటోల ఆల్బం చూపించింది. అతను కాలేజీ రోజుల్నించీ మంచి హాకీ ఆటగాడు. సెలవులకు యింటికి వచ్చినప్పుడు గూడా, యింటిపట్టున ఉండకుండా యేవో ఆటలపోటీలకని చండీఘర్, లక్నోవగైరా యితర వూర్లకి వెళ్తుండేవాడు. తండ్రిలాగే పొడుగ్గా దానికి తగ్గలావుగా ఉండే విగ్రహం అతని చావు వాళ్ల నెంతగా కదిలించి ఉండలో రామ్మూర్తి అర్థం చేసుకోగలడు. యిప్పుడిక సుశీలే వాళ్లకి సర్వం.

భోజనమయ్యాక బయటలాన్లో మల్కానీ, రామ్మూర్తి కూర్చొన్నారు. సుశీల లోపలెక్కడో తల్లికి పనుల్లో సహాయపడ్తోంది.

"మీరేమనుకోనంటే కొన్ని విషయాలు చెప్తాను." అన్నాడు మల్కానీ మాటల సందర్భంలో.

"చెప్పండి."

"ఈ కాలంలో చాలామందికి పైమెరుగులపైనున్న అభిమానం, గౌరవం మనిషి అసలు విలువమీద ఉండవు. చాలామందికి డబ్బు, డిగ్రీలు, అందచందాలు తప్పించి సంస్కారం, నైతిక విలువలు ఉండవు. చిన్నప్పుడు చదువుకున్న యింగ్లీషు పద్యమొకటి జ్ఞాపకమొస్తోంది. ఆమె అంటుంది, 'నాయీ గులాబి చెక్కిళ్ల కోసం, మబ్బులాంటి నల్లని కురుల కోసం శరీరపు యితర వంపుసొంపులకోసం నన్ను కోరకు, యివన్నీ రేపు మాయమవచ్చు. కాని యివేవీ లేకపోయినప్పుడు కూడా నన్నింకా నువ్వు కోరేట్టయితే, నీదాన్నవడానికి నాకభ్యంతరంలేదు.!' అని! ఆగేయం మీరు చదివారా?"

"చదివినట్టు గుర్తు".

"మా అమ్మాయి యిలా భౌతిక విలువల్ని మించిన ఉన్నత స్థాయిలో ఆలోచించ గలిగి నందుకు నాకెంతో గర్వంగా ఉంది. దేశంకోసం మీరుచేసిన త్యాగం, ఆత్యాగానికి ప్రతిగా యే పొగడ్తలూ, సానుభూతులు కోరని మీవినయం, ఎవరూ లేని యీ వొంటరితనాన్ని యెదుర్కొంటున్న మీ మనోనిబ్బరం, ఆమెని కదిలించాయి. అసలు మొట్టమొదటి రోజు మీరామెనుంచి గులాబి అడిగి తీసుకొని ఆమెకిచ్చిన ప్రత్యేకత, ఆమె మిమ్మల్నెన్నటికీ మర్చిపోకుండా చేసింది.

ఆ సంగతి వాళ్లఅమ్మ ద్వారా నాకు మొన్న గానీ తెలిసిందిగాదు! జీవితంలో తనకో ప్రత్యేకమైన విలువయిచ్చిన వ్యక్తికి సహచారి కావడం. కన్నా ఆనందకరమైంది యింకోటుండదు. అందులోనూ ఆవ్యక్తి ఉన్నత లక్ష్యాలు గలవాడు, ఆదర్శంగా నడుచుకునేవాడు అయినప్పుడు అంతకన్నా కావల్సిందేముంటుంది?"

రామ్మూర్తికి యీ సమస్యని యెప్పటికో అప్పటికి యెదుర్కోక తప్పదని తెలుసు. ఆమెచూపులు, మాటలు ఆమెకి తన యెడలఉన్న సద్భావాన్ని యెంతమాత్రం దాచలేదు. అందుకే అతను లోలోపల మధన

వడేసాడు;— యేమని — సమాధానమివ్వాలా అని. సుశీలయెంతో అందమైనది, చదువు కున్నది. ఆమె శారీరక సౌందర్యంకన్నా, కళ్లలో వెలిగే ఆత్మీయమైన ఆమెసౌందర్యం, అతన్ని ముగ్ధుణ్ణి చేస్తోంది. ఆకళ్లు అతన్ని సర్వదా వెంటాడి, ఊహ కందని యేవో ఉన్నత శిఖరాలవైపు పిలుస్తాయి. వాటి లోతుల్ని అందుకో మని ప్రోత్సాహ పడలాయి! అయితే—

తన స్వార్థంకోసం ఆమె కో అవిటి వాణ్ణి అంటగడ్తాడా? ఆమెసౌందర్యానికి సౌహార్ద్రానికి ప్రతిఫలం, జీవితానికి వ్యర్థ మైన తనతో ఆజీవితాంతం సహచర్యమా?

"మీరు యిప్పుడే చెప్పక్కర్లేదు. బాగా ఆలోచించండి. సుశీల మనసారా, మీ సహ చారిణిగా జీవితాంతం మీకు సేవ చెయ్యాలని కోరుకుంటోంది. నాకు కొడుక యినా, కూతురయినా ఆమె ఒక్కతే. యీ యిల్లూ, నేను సంపాదించిన ఆస్తీ కూస్తీ అంతా ఆమెదే. పైగా సుశీల పెద్దచదువు చదువుతోంది. నేనున్నంతకాలం ఆమె ఉద్యోగం చెయ్యాల్సిన అవసరం లేకపోయినా, ఆతర్వాత నా కిష్టమైతే, సుళువుగా యేదో ఉద్యోగం సంపాదించగలదు. మీరు నిశ్చింతంగా విశ్రాంతి తీసుకోవచ్చు. మీకే లోటు జరగదు. మీ కోసం మా చేతనయి నంత చేయగలిగామన్న తృప్తి మాకుంటుంది. అన్నింటి కన్నా ముఖ్యం, సుశీల ఆనందం. ఆమె కింతకన్నా కావాల్సిందేం లేదు...."

రామ్మూర్తి జీవితాని కంతకీ అది కఠిన పరీక్ష. ఎప్పుడూ లేనంతగా సరైన దృష్టితో వ్యవహరించాలి. అందుకు యెంతో నిబ్బరం కావాలి. రామ్మూర్తి ఒక నిర్ణయానికి వచ్చాడు.

"క్షమించండి. —సుశీల చాలా యోగ్యు రాలు. ఆమెకి తగినవాడు నాకన్నా యెంతో ఉన్నతుడయుండాలి. ఆమెని నేను మన స్ఫూర్తిగా గౌరవించిన మాట నిజం. కాని యెప్పుడూ ఆమె నా దృష్టితో చూడలేదు... పైగా నా కింతకుముందే మరొకరితో వివా హం నిశ్చయమైంది!"

మల్హోత్రా ఆశ్చర్యపోయి చూశాడు.

"మీకెవరూ లేరన్నారు! అసలు యీ సంగతి సుశీలతో మాటాయగానన్నా యెప్పుడూ చెప్పినట్టు లేదే!..యిది నిజమా?"

రామ్మూర్తి మాట్లాడలేదు.

"పోనీండి, మీ వ్యక్తిగత విషయాలు సరిగ్గా తెలియక మీకేమన్నా యిబ్బంది కలిగిస్తే....మన్నించండి....ఆమె యెవరో, అదృష్టవంతురాలు!"


ఆతర్వాత రామ్మూర్తిని తిరిగి హాస్పిటల్లో దిగబెట్టింది సుశీల. దారిలో ఆమేం మాట్లాడలేదు. తిరిగి వెళ్లిపోతుంటే ఆమె యేదో మాట్లాడబోయింది. ఆ గొంతు వణకడం గమనించాడతను.

"మీరు నా దగ్గిర దాస్తారనుకో లేదు! అయినా, యిది అందరికీ చెప్పక్కర్లేని వ్యక్తిగత విషయమన్నమాట నిజమే ననుకోండి. కాని యేమిటో, మీకూ నాకూ మధ్య యెలాంటి దాపరికాలు ఉండవనుకోడం నాదే పొరబాటు.....!"

రామ్మూర్తి కేలా చెప్పాలో అర్థమవ లేదు.

"సుశీలా, నన్ను క్షమించండి. యీ జీవితంలో నేనెవ్వరితోనైనా మనసు విప్పి మాట్లాడ్తుంటే అది మీ ఒక్కరితోనే!... యీ సంగతి చెప్పడానికి యింతకుముందు ఆ సందర్భం రాలేదు, అంతేగాని మీనుంచి దాచాలనిగాదు. నన్నర్థం చేసుకోండి."

"ఆమెకి నా అభినందన లందజేయండి." సుశీల వెళ్లిపోయింది.




ఆ తర్వాత కూడా రోజూ ఆమె యెప్పటిలా వచ్చి కబుర్లు చెప్తూనే వుంది. కాని ప్రశాంతమైన ఆమె చూపులు మరింత ప్రశాంతమయ్యాయి. నిర్మలమైన తృప్తి ఆనందాలతో వెలిగే ఆమె మొగంలో కాంతి కొంత కొడిగట్టినట్టయింది. కాని ఆమెని చూసినప్పుడల్లా రామ్మూర్తి గుండెలో రేగే భరించలేని అలజడి ఆమె కర్థం గాదు. యెంతటి దైన్యాన్ని, విషాదాన్ని అతను దిగమింగాడో, ఎలాగో నవ్వుతూ పలికే మాటల వెనక అతనెంతటి వ్యథ పొగుజేసు కున్నాడో, ఆమె ఊహించలేదు.

మరికొన్ని రోజులకి అతన్నిపూనా, 'ఆర్టిఫిషల్ లింబ్ సెంటర్'కి మార్చారు. ఆఖరి రోజు అతనికి వీడ్కోలివ్వడానికి స్టేషనుకి వచ్చి, రైలు కదలబోతుండగా చెయ్యూ డిస్తూ నిలబడ్డ సుశీలకి, అతను ప్రతిగా చెయ్యి ఆడించక, గిరుక్కున వెనక్కి తిరిగి మొగందాచుకున్నప్పుడు, యేదో అర్థమయి నట్టయింది.!

క్రచ్చాలు తగిలించుకొని నడవడానికి ప్రయత్నిస్తున్నాడు రామ్మూర్తి. సాయం కాలాలు ఆరుబయట కుర్చీ వేయించుకుని, ఒక్కడూ ట్రాన్సిస్టరు పాటలు వింటూండ మొక్కటే అతని కాలక్షేపం. ఒకోసారి ఆ పాటలు యేవో జ్ఞాపకాలు తెస్తాయి, యెన్నటికీ విడవక వెంటాడే జ్ఞాపకాలు! వెంటాడి, గుండెని నమిలే జ్ఞాపకాలు!

"కభీ తక్ హోంబయోంమే, హమారి యాద్ ఆయెగీ...." యెలుగెత్తి సాగదీసి పాడుతోంది ముబారక్ బేగం. పాటలో తన్మయుడై వింటూంటే రామ్మూర్తి కళ్లు చెమర్చాయి.

"ఈ పాట కోరినవారు..... ఢిల్లీనుంచి సుశీలా మల్హోత్రా..."అని ప్రకటించింది రేడియో. ●